సాక్షి పల్నాడు

గురువారం । 24 । ఏప్రిల్ । 2025



రెడ్డి పేరంటాలమ్మకు పూజలు

నాదెండ్ల: సాతులూరులో రూ.2 కోట్లతో నిర్మించిన శ్రీ రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయంలో గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



త్రికోటేశ్వర విగ్రహ పునఃజీవ ప్రతిష్ట

సత్తెనపల్లి: అమ్మిశెట్టి వారి వీధిలోని త్రికోటేశ్వర స్వామి విగ్రహ పునఃజీవ ప్రతిష్ట, దేవాలయం పునర్నిర్మాణం, ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం బుధవారం నిర్వహించారు.

ముగిసిన ప్రతిష్టా వేడుకలు



శావల్యాపురం: వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న గంగమ్మ తల్లి, పోతురాజుల, పేర్పిడి ప్రతిష్టా మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. భక్తులు భారీసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణుల దాడులు



ఈపూరు(శావల్యాపురం): వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకుల దాడుల పర్వం కొనసాగుతుంది. దాడుల్లో ఒక వ్యక్తికి తలకు తీవ్ర గాయం కావటంతో వైద్యశాలకు తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఈపూరు మండలం బొమ్మరాజుపల్లె తండాకు చెందిన వైఎస్సార్ సీపీ, టీడీపీ కార్యకర్తలకు ఈనెల 22వ తేదీన చిన్నపాటి ఘర్షణ జరిగింది. మాటా మాటా పెరిగింది. అక్కడున్న వారు సర్ది చెప్పటంతో అంతటితో గొడవ సద్దుమణిగింది. దీన్ని మనసులో ఉంచుకున్న టీడీపీ కార్యకర్తలు మద్యం సేవించి బుధవారం సాయంత్రం సమయంలో తండాకి వెళ్లి అక్కడున్న వారితో వాగ్వివాదానికి దిగారు. ఇంతలో తండాకు చెందిన భూక్యా సోమ్లానాయక్ పొలం నుంచి వస్తూ వారిని నిలవరించటానికి యత్నించాడు. మద్యం మత్తులో ఉన్న నలుగురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ కార్యకర్తలైన సోమ్లా నాయక్, భూక్యా సరోజనీ బాయి, తిరపతి బాయి, లక్ష్మీబాయి పై అందిన వస్తువులతో దాడి చేశారు. వారిలో సోమ్లా నాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు. దాడిలో సోమ్లానాయక్ తలకు 13 కుట్లు పడినట్లు బంధువులు తెలిపారు. సమాచారం అందుకున్న ఈపూరు పోలీసులు వైద్యశాలకు వెళ్లి సంఘటనపై ఆరా తీశారు.

నేటి నుంచి టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో సాధారణ బదిలీల కొరకు పెట్టుకునే ప్రభుత్వ టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు మూడు రోజులపాటు జరుగుతుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు సాధారణ బదిలీ కోసం వైద్య పరీక్షలు చేయించుకునేందుకు ప్రతి ఒక్కరూ జీజీహెచ్ ఆసుపత్రి అభివృద్ధి సంఘం కౌంటర్‌లో రూ. 1,500లు ఫీజు చెల్లించాలన్నారు. అభ్యర్థులు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఉద్యోగ గుర్తింపు కార్డు తీసుకుని ఉదయం 9 నుంచి 12 గంటల మధ్యలో కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 99637 66638 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

సూదివారిపాలెం సర్పంచ్‌కు పంచాయతీ రాజ్ అవార్డు

ఇంకొల్లు(చినగంజాం): జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని సూదివారిపాలెం గ్రామ సర్పంచ్ గోరంట్ల జయలక్ష్మికి కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో అవార్డు ప్రదానం చేశారు. ఢిల్లీలో మంగళవారం నిర్వహించిన పంచాయతీ రాజ్ దివస్ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి వనరుల శాఖా మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో ఆదర్శ గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేస్తున్న రాష్ట్రీయ గౌరవ గ్రామ సభ అవార్డుతో ఆమెను సత్కరించారు.

వీరయ్య చౌదరి హత్య కేసులో రేషన్ మాఫియా?

- పోలీసుల అదుపులో వెదుళ్లపల్లి రైస్ మిల్లు యజమాని
- ఆరా తీస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి హత్య కేసులో రేషన్ మాఫియా పాత్రపై పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. హత్య కేసును విచారిస్తున్న పోలీసులకు రేషన్ మాఫియాపై అనుమానాలు తలెత్తినట్లు సమాచారం. నాగులుప్పలపాడుకు చెందిన చౌక బియ్యం వ్యాపారితో వీరయ్య చౌదరికి విభేదాలున్నాయి. ఆ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనితో కలిసి వ్యాపారం చేసిన పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా బాపట్ల నియోజకవర్గంలోని వెదుళ్లపల్లికి చెందిన రైస్‌మిల్లు యజమానిని కూడా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. వీరయ్య చౌదరి హత్యలో నిజంగా రేషన్ మాఫియా హస్తం ఉందా లేక మరేదన్నా కారణమా? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

పోలీసుల అదుపులో ముగ్గురు..?

పొన్నూరు: పట్టణంలోని నిడుబ్రోలుకు చెందిన గోపి, అమీర్, అశోక్ అనే ముగ్గురిని ఒంగోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రకాశం జిల్లాలో జరిగిన టీడీపీ నేత వీరయ్య చౌదరి హత్య కేసులో వీరి పాత్రపై అనుమానంతో తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఈ ముగ్గురు వెదుళ్లపల్లి మిల్లుకు రేషన్ బియ్యం రవాణా చేస్తున్నట్లు, ఈ క్రమంలో వీరి ప్రమేయంపై అనుమానంతో అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందింది.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటెన్

- 'పది' ఫలితాల్లో రాష్ట్రంలో 11వ స్థానంలో నిలిచిన పల్నాడు
- 598 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల్లో స్టేట్ టాపర్‌గా నిలిచిన ఒప్పిచర్ల విద్యార్థిని పావని చంద్రిక
- విద్యార్థులను అభినందించిన ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి, కలెక్టర్



స్టేట్ ర్యాంకరు, జిల్లా టాపర్లతో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో సర్కార్ పాఠశాలలు సత్తా చాటాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో పది ఫలితాలలో రాణించారు. బుధవారం ప్రకటించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలలో పల్నాడు జిల్లా రాష్ట్రంలో 11వ స్థానంలో నిలిచింది. జిల్లాలోని 433 ఉన్నత పాఠశాలల నుంచి 25,382 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 21,358 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతా శాతం 84.15 శాతంగా ఉంది. కాగా, గతేడాది 25,207 మంది హాజరు కాగా, 23,792 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, ఉత్తీర్ణతా శాతం 86.05 శాతంగా ఉంది. గతేడాది రాష్ట్రంలో 18వ స్థానంలో నిలిచిన పల్నాడు జిల్లా ఈఏడాది 11వ స్థానానికి ఎగబాకినప్పటికీ ఉత్తీర్ణత శాతం 2 శాతం దిగజారింది. కాగా, జిల్లాలో బాలుర ఉత్తీర్ణత 81.39 శాతం ఉండగా, బాలికలు పైచేయి సాధిస్తూ 86.91 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణులైన వారిలో 16,887 మంది ఫస్ట్ డివిజన్, 3,070 మంది సెకండ్ డివిజన్, 1,401 మంది థర్డ్ డివిజన్ సాధించారు.

- జిల్లాలోని కారెంపూడి మండలం ఒప్పిచర్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని అంగడి పావని చంద్రిక 598 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే షేక్ సమీర 596 (జడ్పీ బాలికల హైస్కూల్, మాచర్ల), ప్రత్తిపాటి అమూల్య 593 (జడ్పీ హైస్కూల్, తూబాడు), తన్నీరు సాయిరామ్ 591 (ఏపీ మోడల్ స్కూల్, చీకటీగల పాలెం), పిట్టల విజయలక్ష్మి 591 (జడ్పీ హైస్కూల్, చిరుమామిళ్ల), జె.ఖాతీజా 591 (జడ్పీ హైస్కూల్, వినుకొండ), చప్పల నవ్య 590 (జడ్పీ హైస్కూల్, ఓబులేసునిపల్లె), జి.రాధిక 590, (జడ్పీ హైస్కూల్, నకరికల్లు), అనుముకొండ రేవతి 590 (జడ్పీ హైస్కూల్, శంకరభారతీపురం), కోనేటి కావ్యశ్రీ 590 (జడ్పీ హైస్కూల్, కారంపూడి) మార్కులు సాధించి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్లుగా నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభినందించారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జేసీ సూరజ్ గనోరే, డీఈఓ తదితరులు టాప్ ర్యాంకర్లను అభినందించారు.

కారెంపూడి: టెన్త్ పరీక్షా ఫలితాలలో కారెంపూడి బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కె.కావ్యశ్రీ 591 మార్కులు సాధించిందని ఎంఈఓ రవి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

స్టేట్ టాపర్ పావని చంద్రిక

598 మార్కులు సాధించిన ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని

కారెంపూడి: పల్నాడు జిల్లా కారెంపూడి మండలం ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని అంగడి పావని చంద్రిక పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. చంద్రిక 600 మార్కులకు గాను 598 మార్కులు సాధించింది. హిందీ, ఇంగ్లిషుల్లో ఒక్కో మార్కు తగ్గింది గానీ మిగతా అన్ని సబ్జెక్టుల్లో నూటికి నూరు మార్కులు వచ్చాయి.

మట్టిలో మాణిక్యం

అంగడి పావని చంద్రిక తండ్రి సాంబశివరావు వినుకొండ పురపాలక సంఘం కార్యాలయంలో అటెండర్‌గా, తల్లి సంధ్య పిడుగురాళ్ల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. వీరి స్వగ్రామం పిడుగురాళ్ల.. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా అక్కడ ఇంటిని అమ్మేశారు. అప్పటి నుంచి పావని చంద్రిక ఒప్పిచర్లలో ఉన్న అమ్మమ్మ సామ్రాజ్యం సంరక్షణలో ఉంటూ ఇంటికి దగ్గర్లోని జెడ్పీ హైస్కూల్‌లో చదువుతోంది. చంద్రిక



పావని చంద్రిక, తల్లి సంధ్యలను అభినందిస్తున్న డీఈఓ చంద్రకళ, హెచ్‌ఎం

తమ్ముడు లక్ష్మణ్ పిడుగురాళ్లలోని ఓ ప్రైవేటు స్కూల్లో 7వ తరగతి పరీక్షలు రాశాడు. అమ్మమ్మ సామ్రాజ్యం, మేనమామ లక్ష్మణ్‌ల సంరక్షణలో పావని చంద్రిక చదువుపై శ్రద్ధ చూపింది. అల్లుడు, కూతురు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే మనవరాలిని దగ్గరకు తీసుకుని చదివించింది చంద్రిక అమ్మమ్మ సామ్రాజ్యం. కరోనా కాలంలో సామ్రాజ్యం భర్త వెంకటేశ్వర్లు మృతి చెందాడు. దీంతో మనవరాలు పావని చంద్రిక అమ్మమ్మకు తోడుగా ఉంటూ బాగా చదువుకుంది.

పల్నాడుకు ఖ్యాతి

పావని చంద్రిక ప్రత్యేకంగా ఏ ట్యూషన్‌కు వెళ్లలేదు.. స్కూల్లో ఏ రోజు చెప్పినవి అదే రోజు చదువుకునేది. అమ్మమ్మ తెల్లవారు జామున 4 గంటలకే నిద్ర లేపేది. స్కూలుకు వెళ్లేలోగా అమ్మమ్మకు ఇంటి పనిలో సాయం కూడా చేసేది. ఎలాంటి సౌకర్యాలు లేని పల్లెటూరులో నివాసం ఉంటూ జెడ్పీ హైస్కూల్లో చదివి అత్యుత్తమ మార్కులతో పల్నాడుకే పేరు తెచ్చింది పావని చంద్రిక. బాలికా విద్యలో వెనుకబడిన పల్నాడు నుంచి, పైగా గిరిజన తెగకు చెందిన బాలిక పావని చంద్రిక విజయకేతనం ఎగురవేసి రాష్ట్రమంతా తన వైపు చూసేలా సత్తా చాటింది.

అభినందనల వెల్లువ..

ప్రభుత్వ పాఠశాలల్లో స్టేట్ టాపర్‌గా నిలిచిన పావని చంద్రికను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, డీఈఓ చంద్రకళలు అభినందించారు. చదువులో మొదటి నుంచి పావని చంద్రిక ప్రతిభ చూపుతోంది. 8వ తరగతిలో నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. ఆ తర్వాత జిల్లా, డివిజన్ స్థాయిల్లో నిర్వహించిన టాలెంట్ టెస్టుల్లో ప్రతిభ చూపింది. హెచ్‌ఎం విజయలలిత, ఉపాధ్యాయులు రమాదేవి, దుర్గాదేవి, కిరణ్ కుమారి, అబ్దుల్ రఫీ, సీతామహాలక్ష్మి, సునీత, హనుమంతరావుల శిక్షణలో స్టేట్ టాపర్‌గా నిలిచానని పావని చెబుతోంది.

మీ భవితకు అండగా నిలుస్తాం

- కావ్యశ్రీని దత్తత తీసుకున్న కలెక్టర్
- పావని చంద్రికను దత్తత తీసుకున్న ఆర్అండ్‌బీ ఎస్ఈ



ప్రభుత్వ పాఠశాలల్లో స్టేట్ టాపర్‌గా నిలిచిన పావని చంద్రికకు స్వీటు తినిపిస్తున్న కలెక్టర్

నరసరావుపేట: పదవ తరగతి పరీక్షలలో 591 మార్కులు సాధించిన కారెంపూడి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని కోనేటి కావ్యశ్రీని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు దత్తత తీసుకున్నారు. రామయ్య, కోటేశ్వరమ్మ దంపతుల పుత్రిక అయిన కావ్యశ్రీ ఉన్నత చదువులకు ఇబ్బంది లేకుండా చూస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే మంచి మార్కులు రావనే అభిప్రాయాలను పటా పంచలు చేస్తూ జిల్లా విద్యార్థులు అసాధారణ ఫలితాలు సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో స్టేట్ టాపర్‌గా నిల్చిన పావని చంద్రికకు స్వీటు తినిపించి అభినందించారు. కలెక్టర్ అడుగుజాడల్లో నడుస్తూ రోడ్లు భవనాల శాఖ ఎస్.ఈ రాజనాయక్ 598 మార్కులు సాధించిన పావని చంద్రికను దత్తత తీసుకున్నారు. అదేవిధంగా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను బుధవారం కలెక్టరేట్‌కు ఆహ్వానించి అభినందించారు. జేసీ గనోరే సూరజ్ ధనుంజయ్, డీఈఓ ఎల్.చంద్రకళ పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడులు హేయం



జాతీయ జెండా, నల్ల బ్యాడ్జీలతో ర్యాలీ నిర్వహిస్తున్న పీఆర్కే, నాయకులు, స్థానికులు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

మాచర్ల: జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలోని అనంతనాగ్ జిల్లా పహల్గాంలో ఉగ్రవాదులు 28 మందిని దారుణంగా హతమార్చడం అత్యంత హేయమైన ఘటన అని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) పేర్కొన్నారు. బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు వందలాది మందితో మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నల్లబ్యాడ్జీలు ధరిస్తూ పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిని తీవ్ర దిగ్భ్రాంతి కలిగించే అంశమని, తీవ్ర వాదాన్ని అణచివేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉగ్రవాదం నశించాలి.. ఉగ్రవాదులను తరిమికొడదాం. సమైఖ్యంగా ఉందాం.. జై భారత్, జై జై భారత్ అంటూ జాతీయ జెండాను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. మాచర్ల ఎంపీపీ పోతురెడ్డి కోటిరెడ్డి, జెడ్పీటీసీ మండ్లి పెద మల్లుస్వామి, మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ జలీల్, మాజీ జెడ్పీటీసీ బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల నాయకుడు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోలా శ్రీను, మంచికల్లు చంద్రారెడ్డి, సర్పంచ్ గొట్టం బ్రహ్మారెడ్డి, నాయకులు బూడిద సైదులు, నవులూరి చెన్నారెడ్డి, పఠాన్ సత్తార్ ఖాన్, షేక్ నాగూర్, కౌన్సిలర్‌లు మందా సంతోష్, మాచర్ల సుందరరావు, దుర్గి మండల నాయకులు ఉన్నం వెంకటేశ్వరరావు (పెద్దబ్బాయ్), షేక్ మస్తాన్, కో-ఆప్షన్ మెంబర్ అల్లి జీవన్, మైనార్టీ నాయకులు సయ్యద్ బాషా, షేక్ ఉస్మాన్, షేక్ జాని, సయ్యద్ బాబా వలి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు.



అమరావతిలో కొవ్వొత్తుల ర్యాలీ

కశ్మీర్ మృతుల ఆత్మశాంతి కోరుతూ ర్యాలీ


అమరావతి: కశ్మీర్‌లోని పహల్గాం వద్ద ఉగ్రవాదుల చేతిలో బలైన 28 మంది పర్యాటకుల ఆత్మ శాంతికి బుధవారం అమరావతిలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక అమరేశ్వరాలయం నుంచి నల్ల బ్యాడ్జిలు ధరించి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకుడు కోలా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈర్యాలీ మెయిన్ రోడ్డులోని గాంధీబొమ్మ సెంటర్, దుర్గావిలాస్ సెంటర్‌ల మీదుగా మద్దూరు డౌన్ సెంటర్ వరకు సాగింది. బీజేపీ నాయకులు మద్ది ధాత్రినారాయణ, రమణ, నేరెళ్ల హనుమంతరావు, మేకల శివశంకర్ పాల్గొన్నారు.

ప్రధాని సభకు సిద్ధం కండి

నరసరావుపేట: మే 2వ తేదీన రాష్ట్ర రాజధాని అమరావతిలో జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభకోసం కసరత్తు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా నుంచి 30వేల మంది సభకు హాజరవనున్నట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని నియోజకవర్గం, మండలం, గ్రామ-వార్డు సచివాలయ స్థాయిల నుంచి ఎంత మంది ప్రజలు ఏయే మార్గాన సభకు వెళ్లనున్నారో వివరాలు సేకరించాలన్నారు. 600 బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. భోజన వసతి, ఎండలను దృష్టిలో ఉంచుకుని ఎక్కడికక్కడ చల్లని తాగునీరు, మజ్జిగ అందించాలన్నారు. జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో ఎ.మురళి, డీఎఫ్ఓ కృష్ణప్రియ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రమణీయం..చారిత్రక దృశ్యకావ్యం

- చారిత్రక సంపదకు, ప్రకృతి సోయగాలకు నెలవు నాగార్జున కొండ
- నాటి చరిత్రకు ప్రతిరూపం అనుపు
- వేసవి సెలవుల్లో వినోదం.. విజ్ఞానదాయకం



నాగార్జునకొండపై మ్యూజియం



విజయపురిసౌత్: విద్యార్థులకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాలకు అతి సమీపంలో ఉన్న నాగార్జున సాగర్‌ను కుటుంబ సమేతంగా వేసవి సెలవుల్లో చూడాల్సిందే. సాగర్ పర్యాటకులకు స్వర్గధామంగా నిలుస్తుంది. చారిత్రాత్మకమైన ప్రాంతమే కాకుండా సాంకేతిక పరంగా సాగర్ ప్రాజెక్టు సందర్శన ఎంతో విజ్ఞానదాయకంగా నిలుస్తోంది. కృష్ణా జలాశయంలో లాంచీ ప్రయాణం ఆహ్లాదకరం. లాంచీలో ప్రయాణించి జలాశయం మధ్యన ఎనలేని ప్రఖ్యాతి ఉన్న నాగార్జున కొండ మ్యూజియం సందర్శించాల్సిందే. ప్రపంచంలోనే మానవ నిర్మిత ఐలాండ్ మ్యూజియంలలో నాగార్జునకొండ రెండవది. ఆచార్య నాగార్జునుని విశ్వవిద్యాలయం ఇక్కడ ఉంది. బుద్ధదంత ధామమయమైన మహాస్థూపం, విశాలమైన వివిధ భిక్షువిహారాలు ఉన్నాయి. వీటన్నింటితో ఇక్ష్వాకుల రాజధానిగా విలసిల్లిన విజయపురి ప్రాంతం సాగర్‌లో ముంపునకు గురి కాకుండా కేంద్ర పురావస్తు శాఖ వారు అక్కడ విశేష సామగ్రిని పరిరక్షించి, నేడు నాగార్జున కొండలో ప్రదర్శిస్తున్నారు.

మహా చైత్యం



మ్యూజియంలో బుద్ధుని ధాతువు ఉన్న మట్టి, రాగి, వెండి, స్వర్ణ, కలశాలు

ఇది బుద్ధ దాతువుపై కట్టిన అందాల చైత్యం. ఈస్థూపం నుంచి తవ్వి తీసిన ధాతువును ప్రస్తుతం బుద్ధుడు మొదటి ప్రసంగం చేసిన సారనాథ్‌లో ఉంచి, పూజిస్తున్నారు. ఇది శారీరక స్థూపాల జాతికి చెందినది. దీని అంతర్భాగంలో బుద్ధభగవానుని అస్థికలు అమర్చబడ్డాయి. ఇది ప్రాచీన శిల్ప నిర్మాణ ప్రావీణ్యానికి నిదర్శనం. చక్రము దాని ఆకులను ఇటుక గోడల్లా నిర్మించి ఆకుల మధ్య ఖాళీ స్థలాన్ని మట్టితో కప్పి స్థూపాకారాన్ని తయారు చేసి ఉపరితలాన్ని చుట్టుపక్కల పాలరాతి పలుకలతో కప్పి అర్ధగోళాకారంగా అందంగా నిర్మించారు.

హారతీ దేవాలయం

విశ్వవిద్యాలయానికి కొద్దిదూరంలో హారతీ దేవాలయం దాని దిగువన చతురస్రాకారంలో ఒకపెద్ద సరస్సు ఉంది. దీనికి నలువైపుల మెట్లతో ఒడ్డు ప్రాంతాలున్నాయి. హారతీ దేవాలయంలో ప్రవేశానికి ముందు ఈ సరస్సులో స్నానమాచరించేవారు.

ప్రాచీన విశ్వవిద్యాలయం

ఈ విశ్వవిద్యాలయం శిథిల అవశేషాలు నాగార్జునకొండ లోయలో ఏవిధంగా ఉండేవో అదే విధంగా ఆ ఇటుకలతోనే అనుపు వద్ద అమర్చారు. కృష్ణానది తీరాన విశాలమైన విస్తీర్ణంలో ఈ విశ్వవిద్యాలయం నెలకొని ఉండేది. ఇది ప్రాచీన కాలపు గురుకులమై గురుశిష్య నివాసాలు ఒకేదగ్గరుండి సకల శాస్త్ర విజ్ఞాన కేంద్రమై, ప్రపంచఖ్యాతి గాంచింది.



నాగార్జునకొండపై ఉన్న మహాస్థూపం

నాగార్జున కొండకు ఇలా చేరుకోవాలి..

నాగార్జునకొండకు వెళ్లాలంటే విజయపురి సౌత్‌లోని లాంచీస్టేషన్ నుంచి 14కి.మీ. దూరం కృష్ణానదిలో ప్రయాణం చేయాలి. కొండకు చేరుకునేందుకు లాంచీలో 45 నిమిషాల సమయం పడుతుంది. నాగార్జునకొండ ప్రపంచంలోనే రెండవ ఐలాండ్ మ్యూజియం. నాగార్జున సాగర్ పరిధిలోని విజయపురిసౌత్‌లో లాంచీస్టేషన్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు లాంచీలు పర్యాటకులకు అందుబాటులో ఉంటాయి. పెద్దలకు లాంచీ టిక్కెట్టు ధర రూ.200, మ్యూజియం, మాన్యుమెంట్ సందర్శనకు రూ.30, 6 నుంచి 12 సంవత్సరాల చిన్నారులకు లాంచీకు రూ.150, మ్యూజియం సందర్శనకు 14 సంవత్సరాలలోపు చిన్నారులకు ఉచితం. గ్రూపుగా వచ్చే విద్యార్థులకు లాంచీటిక్కెట్‌పై 20 శాతం రాయితీని పర్యాటకశాఖ ఇస్తుంది. ఇతర వివరాలకు లాంచీస్టేషన్ 9705188311 నెంబర్‌ను సంప్రదించవచ్చు.


సింహళ విహారం

మహాచైత్యం పక్కన సింహళ విహార శిథిలాలున్నాయి. ఈవిహారంలో బుద్ధ విగ్రహాన్ని స్థాపించారు. సింహళీయులు, ఈవిహారంలో నివసించి, నాగార్జునకొండలో పలుకుబడి సంపాదించుకున్నారని ప్రతీతి. చాంతిసిరి ఈవిహారానికి ఎన్నో ధానధర్మాలు చేసినట్లు చరిత్రద్వారా వెల్లడవుతుంది. ఇవేకాక ఇంకా కూర్మక్షతి కుండం, ఇక్ష్వాకు రాజసౌధాలు సతీసహగమన ఘట్టం, ఇక్ష్వాకు రాజులు అశ్వమేధ యజ్ఞశాల తదితర కట్టడాలు కూడా నాగార్జునకొండలో ఉన్నాయి.



సింహళ విహారంలో బుద్ధ ప్రతిమ నమూనా

ఎత్తిపోతల సోయగం



సాగర్‌కు 15 కి.మీ. దూరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలో చంద్రవంక నదిపై సహజ సిద్ధంగా ఏర్పడిన జలపాతం. ఇది 70 అడుగుల పైనుంచి జాలువారే జలపాతం. పర్యాటకుల మనస్సును ఇట్టే ఆకర్షిస్తుంది. పూర్వకాలంలో యతులు తపస్సు చేసుకునే ప్రాంతం కావటంతో ఎత్తిపోతల అనే పేరు వచ్చింది. పెద్దలకు రూ.30 పిల్లలకు రూ.20 ప్రవేశ రుసుము వసూలు చేస్తారు. సాగర్‌నుంచి ముగ్గురు నలుగురు కలిసి ఆటో మాట్లాడుకుని వెళ్లాలి.

క్లుప్తంగా

ముష్కర మూకలను కఠినంగా శిక్షించాలి

కశ్మీర్ మృతులకు సంతాప సూచకంగా వైఎస్సార్ సీపీ శ్రేణుల కొవ్వొత్తుల ర్యాలీ



నరసరావుపేట: జమ్ము, కశ్మీర్ రాష్ట్రంలో పహల్గామ్ ప్రాంతంలో యాత్రికులపై కాల్పులు జరిపి 28మంది మృతికి కారకులైన ముష్కర మూకలను వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల భార్గవరెడ్డి డిమాండ్ చేశారు. జరిగిన సంఘటనపై వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం రాత్రి మృతిచెందిన వారికి సంతాప సూచకంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పల్నాడురోడ్డులోని జీబీఆర్ హాస్పిటల్ నుంచి భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు శాంతియుతంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారందరికీ పార్టీ తరఫున సంతాపం తెలియచేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల సాంబశివారెడ్డి మాట్లాడుతూ ఇది యావత్తు దేశంపై జరిగిన దాడిగా పరిగణించాలన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి దాడులు జరగకుండా ప్రధాని నరేంద్రమోదీ చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, దివ్యాంగుల విభాగం జిల్లా విభాగ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్గి బండి వచ్చేలోపు బుగ్గి!

- అమరావతిలో అగ్నిమాపక కేంద్రం లేక ఇబ్బందులు
- ఎటు చూసినా 30, 40 కి.మీల దూరంలో కేంద్రాలు.. అక్కడి నుంచి వచ్చేలోపు నష్టం జరుగుతున్న వైనం
- సొంత స్థలం ఉన్నా నిర్మాణానికి నోచుకోని వైనం



ధరణికోట బీసీ కాలనీలో తగలబడుతున్న ఇల్లు (ఫైల్)

అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రం, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పర్యాటక కేంద్రమైన అమరావతి, పరిసర ప్రాంతాలలో జరిగే అగ్ని ప్రమాదాలను నివారించేందుకు, ప్రమాదంలో బాధితుల ఆస్తులు రక్షించేందుకు అగ్నిమాపక కేంద్రం అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం అగ్నిమాపక కేంద్రానికి స్థల సేకరణ జరిగినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఫైర్‌స్టేషన్ దూరంగా ఉండటం వల్ల సకాలంలో ఫైరింజన్ రాక ప్రజల ఆస్తులు అగ్నికి ఆహుతవుతున్నాయి.

30 కి.మీ దూరం నుంచి వచ్చే లోపు..

మండలంలో ఏ చిన్న అగ్ని ప్రమాదం జరిగినా క్రోసూరు ఫైర్ స్టేషన్‌పై ఆధార పడాల్సి వస్తుంది. అమరావతికి 40కి.మీ దూరంలో మంగళగిరి, 30 కి.మీ దూరంలో క్రోసూరు, సత్తెనపల్లి అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. దీంతో సమాచారం అందుకుని ఫైరింజను వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. క్రోసూరు అగ్నిమాపక కేంద్ర పరిధిలో సుమారుగా 120 నుంచి 150కి పైగా కేసులు నమోదు అవుతున్నాయి. గతేడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు 20కి పైగా అగ్నిప్రమాదాలు నమోదు అయినట్లు సమాచారం. ఇందులో ఎక్కువశాతం సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకోలేకపోవటంతో ఆస్తులు బుగ్గిపాలు అయ్యాయి. ఈక్రమంలో ప్రమాదాల నివారణకు అమరావతి కేంద్రంగా మరో అగ్నిమాపక కేంద్ర ఏర్పాటు చేస్తే గుంటూరు రూట్‌లో నిడుముక్కల వరకు, విజయవాడ రూట్‌లో తుళ్లూరు వరకు, సత్తెనపల్లి రూట్‌లో పెదకూరపాడు వరకు, క్రోసూరు రూట్‌లో ఊటుకూరు వరకు ప్రమాదం జరిగిన 15 నిముషాలలో చేరుకునే అవకాశం ఉంది.

జరగాల్సిన నష్టం జరిగిపోతోంది..



ప్రమాదాలు సంభవించినప్పుడు అమరావతిలో అగ్నిమాపకదళ కేంద్రం ఉంటే ఆస్తులు, ప్రాణాలను కాపాడొచ్చు. ఎక్కడో దూరం నుంచి వచ్చేటప్పటికి నష్టం జరిగిపోతుంది. గతంలో ఉన్నతాధికారులకు ఎన్నో వినతులు సమర్పిస్తే మంజూరైన అగ్నిమాపక కేంద్రానికి స్థలసేకరణ జరిగి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు నిర్మాణం చేయకపోవడం శోచనీయం.

– కారసాల కుమార్, రాజీవ్‌కాలనీ, అమరావతి

జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తాం..

గతంలో అమరావతి గ్రామ పంచాయతీ 17 సెంట్లు స్థలం ఇస్తున్నట్లు తీర్మానం చేశారు. కానీ మాకు అందులో రెవెన్యూ శాఖ 12 సెంట్లు మాత్రమే అప్పగించింది. మిగిలిన ఐదు సెంట్లకు కూడా జిల్లా అగ్నిమాపక శాఖ తరఫున అనేకమార్లు రెవెన్యూశాఖకు రిమైండర్స్ పంపాం. ఈరోజుకు పెండింగ్ లోనే ఉంది. స్థలం 17 సెంట్లు అప్పగిస్తే గానీ అగ్నిమాపక కేంద్రానికి అంచనాలు వేస్తాం. జిల్లా కలెక్టర్‌కు ఈ సమస్యను నివేదిస్తాం.

– శ్రీధర్, పల్నాడు జిల్లా ఫైర్ ఆఫీసర్

స్థలమున్నా.. ఉపయోగం సున్నా

అమరావతిలో అగ్నిమాపక కేంద్రం నిర్మించటానికి సుమారు 17 సెంట్ల స్థలం రెవెన్యూ శాఖ ద్వారా ప్రభుత్వం ఎనిమిదేళ్ల క్రితమే అగ్నిమాపక శాఖకు కేటాయించింది. అయితే ఇంతవరకు నిర్మాణం మొదలు కాలేదు. స్థలంలో మాత్రం ఇది అగ్నిమాపక శాఖకు చెందినదనే బోర్డుమాత్రం ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు.



జిల్లాలో విస్తృతంగా వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నరసరావుపేట: జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపేవారు, ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి జిల్లాలోని ప్రధాన రహదారులు, పలు ప్రాంతాల్లో పోలీసులు బహిరంగ మద్యం సేవించటం, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై దృష్టి సారిస్తూ విస్తృతంగా వాహనాల తనిఖీలు చేశారు. నగర శివారు ఖాళీ ప్రదేశాలు బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై దాడులు నిర్వహించి 132 కేసులు నమోదు చేశారు. సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టిన పోలీసు అధికారులు, సిబ్బంది రహదారి భద్రత నిబంధనలను ఉల్లంఘించి మద్యం సేవించి వాహనాలు నడిపిన వాహనదారులపై కేసులు నమోదు చేశారు. అలాగే జిల్లాలోని నరసరావుపేట ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వరవకట్ట, ఈపూరు మండలం బొగ్గరం గ్రామం, అచ్చంపేట, పిడుగురాళ్ల మండలం జూలకల్లు గ్రామం, దుర్గి మండలం ఆత్మకూరు గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు.

చిలకలూరిపేట డిపో నుంచి హైదరాబాద్‌కు ఇంద్ర బస్సులు

నకరికల్లు, పిడుగురాళ్ల, దాచేపల్లి డిపోల నుంచి రిజర్వేషన్ సౌకర్యం

చిలకలూరిపేటటౌన్: చిలకలూరిపేట డిపో నుంచి హైదరాబాదు - బీహెచ్‌ఈఎల్ ఏసీ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు డీఎం ఎస్.రాంబాబు బుధవారం తెలిపారు. డిపో వినియోగదారుల అవసరాలు పరిశీలించి హైదరాబాద్, బీహెచ్‌ఈఎల్ మార్గాల్లో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కొత్తగా రిజర్వేషన్‌ను ప్రారంభించామన్నారు. ఇందులో భాగంగా చిలకలూరిపేట నుంచి హైదరాబాద్ (మియాపూర్, ఈసీఐఎల్, బీహెచ్‌ఈఎల్) సెక్టార్లో ఇంద్ర ఏసీ బస్సులు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. పట్టణ డిపో నుంచి 7 సర్వీసులు, అక్కడి నుంచి తిరిగి వచ్చేందుకు 7 సర్వీసులు ఉన్నాయన్నారు. చిలకలూరిపేట నుంచి హైదరాబాద్‌కు డిపో నుంచి ఆయా సర్వీసులకు నకరికల్లు, పిడుగురాళ్ల, దాచేపల్లిలో తగినంత సీట్లను సులభంగా బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

ధూళిపాళ్లలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



సత్తెనపల్లి: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలో బుధవారం లభ్యమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలో మృతదేహం ఉందని స్థానికులు సత్తెనపల్లి రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. సుమారు 35–40 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతదేహంపై మెరూన్ రంగు టీ షర్ట్, దానిపై ఎవరెస్ట్ అని ప్రింట్ చేసి ఉంది. గ్రే రంగు పాయింటు ధరించి ఉన్నాడు. నలుపు రంగు బెల్టు ఉండి బెల్ట్ బకెట్ ఆరంజ్, నలుపు రంగులో ఉంది. మృతుడి మెడకి రెండు తాయిత్తులు, కుడి చేతికి రబ్బర్ బ్యాండ్, నడుముకు నాలుగు పేటల నలుపు, ఎరుపు రంగుల మొలతాడు ఉంది. మృతుడు పొడవు సుమారు 5 అడుగుల 2 అంగుళాలు, నలుపు రంగులో ఉన్నాడు. మృతుని వివరాలు తెలిసినవారు సత్తెనపల్లి రూరల్ సీఐ 94407 96231, సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ 80199 98643 నెంబర్లకు తెలియ చేయాలని పోలీసులు కోరారు.

రంగాకాలనీలో కార్డెన్ సెర్చ్



సత్తెనపల్లి రంగాకాలనీలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణంలోని రంగా కాలనీలో బుధవారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ హనుమంతురావు మాట్లాడుతూ రంగా కాలనీలో ఇటీవల చోటు చేసుకుంటున్న గొడవల నేపథ్యంలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగిందన్నారు. ఉద్దేశపూర్వకంగా ఘర్షణలకు పాల్పడిన వారిని జైలుకు పంపుతామని హెచ్చరికలు చేశారు. ఒక్కసారిగా 100 మందికి పైగా పోలీసులు ఇంటింటి తనిఖీలు చేపట్టడంతో రంగాకాలనీలో ఏదో జరిగిందంటూ కొంత సేపు కాలనీవాసులు ఉలిక్కిపడ్డారు. తనిఖీల్లో ఆయుధాలు ఏమి దొరక లేదని, ఎటువంటి కాగితాలు లేని 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల ప్రతిష్ఠా మహోత్సవం




విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

అమరావతి: మండలంలోని ఎనికపాడు గ్రామంలో హనుమత్, లక్ష్మణ సీతాసమేత రామచంద్రస్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. యాజ్ఞిక బ్రహ్మ పరాశరం రామకృష్ణమాచార్యుల పర్యవేక్షణలో వైఖానసాగమంలో చంచాహ్నికహ్నిక దీక్షతో ఉత్సవాలను నిర్వహించారు. ప్రతిష్ఠా సుముహూర్తమైన 8గంటలకు తొలుత యంత్ర స్థాపనచేసి యాగశాల నుంచి స్వామివార్లను ఊరేగింపుగా తీసుకుని వచ్చి నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించారు. అనంతరం అత్యంత వైభవంగా జీవధ్వజ ప్రతిష్ఠాకార్యక్రమం నిర్వహించారు. మహా పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ మహా సమారాధన నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం మొదట ధేను దర్శనం, దిష్టికుంభం, కన్యాదర్శనం అనంతరం ప్రథమార్చన నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం దేవాలయ నిర్వాహకులచే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌లు కుటుంబసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ

80 గ్రాముల బంగారు ఆభరణాలు మాయం



మాచర్ల రూరల్: పట్టణంలో నగల దుకాణ యజమాని ఇంటి గ్రిల్స్ తాళం పగులకొట్టి, లోపలికి వెళ్లి బీరువా పగులకొట్టి లాకర్‌లోని 80 గ్రాముల బంగారాన్ని చోరీ చేసిన సంఘటన మంగళవారం జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని 17వ వార్డు సాయిబాబా గుడి దగ్గరలో నివసిస్తున్న వుస్తేపల్లి రామలింగేశ్వరరావు (రాంబాబు) అనే అతను రామాటాకీస్ లైన్‌లో జ్యూయలరీ షాపు నిర్వహిస్తుంటాడు. ఉదయమే ఇంటికి తాళం వేసి భార్య ధనలక్ష్మితో కలిసి షాపునకు వెళ్ళి, తిరిగి రాత్రి 9.30సమయంలో ఇంటికి వస్తుంటారు. ఇదే క్రమంలో మంగళవారం షాపునకు వెళ్ళిన వారు తిరిగి రాత్రి ఇంటికి వచ్చి చూడగా ఇంటి గ్రిల్స్ తాళం పగలకొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో లాకర్‌ను పగలకొట్టి అందులో వున్న 80 గ్రాముల విలువైన బంగారపు కమ్మలు, ఉంగరాలు, చైన్, నక్లెస్ చోరీ చేసినట్లుగా గుర్తించారు. బుధవారం రాత్రి పట్టణ పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహులు పేర్కొన్నారు.

'ప్రభుత్వ' విద్యార్థులు గొప్పగా రాణించారు

జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నరసరావుపేట: పదవ తరగతి పరీక్షలలో జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచారని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పరిధిలో 598 మార్కులు జిల్లా నుంచే నమోదయిందన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత విద్యా సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో 18వ స్థానంలో ఉన్న పల్నాడు జిల్లా ఈ ఏడాది 11వ స్థానానికి ఎగబాకిందన్నారు. అద్భుత ఫలితాలు సాధించడంలో కృషిచేసిన డీఈఓ చంద్రకళ, విద్యా శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులను అభినందించారు. రానున్న విద్యా సంవత్సరంలో మరింత గొప్ప ఫలితాలు సాధించేలా పని చేయాలన్నారు. డీఈఓ చంద్రకళ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ తీసుకున్న చర్యల వల్లే 2024–25 విద్యా సంవత్సరంలో పల్నాడు జిల్లా మెరుగైన ఫలితాలు సాధించగలిగిందని అన్నారు. టాపర్లకు, చదువుల్లో వెనకబడిన విద్యార్థులకు వేరు వేరుగా లక్ష్యాలు నిర్దేశించుకుని పరీక్షలకు సన్నద్ధం చేశామన్నారు. భవిష్యత్తులో 7,8 తరగతుల నుంచి చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్న కలెక్టర్ ఆదేశాలను పాటించనున్నామన్నారు.

మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లో 87 శాతం ఉత్తీర్ణత

నాలుగు కేజీబీవీల్లో 100 శాతం ఉత్తీర్ణత



సాక్షితా రెడ్డి



గంగవరపు ప్రణతి



గంగహర్షిత



షేక్ షాహిద్



బి.ప్రసన్న

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని ఏపీ మోడల్ స్కూళ్లు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 87 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలోని 14 మోడల్ స్కూళ్ల నుంచి 1,072మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరు కాగా, 936 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతా శాతం 87.31 శాతంగా ఉంది. అలాగే జిల్లాలోని 24 కేజీబీవీ పాఠశాలల నుంచి 877 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరు కాగా, 763 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత 87 శాతంగా ఉంది. చిలకలూరిపేట, అచ్చంపేట, నాదెండ్ల, నూజెండ్ల కేజీబీవీలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

రాజుపాలెం: మండలంలో పదవ తరగతి విద్యార్థులు 83 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ-1, 2 మల్లిఖార్జునశర్మ, నరసింహరావులు బుధవారం తెలిపారు. మండలకేంద్రంలోని నవోదయ పాఠశాల నుంచి 37 మంది 10వ తరగతి విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 34 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. నవోదయ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి శీలం ఈశ్వర్ 600 మార్కులకుగాను 595 మార్కులు సాధించాడన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సత్తా

మాచవరం: మండలంలోని మోర్జంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మూలగుండ్ల సాక్షితారెడ్డి 589 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. మండలంలో మొత్తం 464 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కాగా 334 మంది ఉత్తీర్ణులై 74 శాతం ఉత్తీర్ణత శాతం సాధించినట్లు ఎంఈఓలు డి.శ్రీధర్, ఎ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. వేమవరం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని గంగవరపు ప్రణతి 582 మార్కులు సాధించి రెండవ స్థానంలో, మాచవరం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని బద్దిశెట్టి గంగహర్షిత 581 మార్కులతో మూడవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

88త్యాళ్లూరు జెడ్పీ పాఠశాలలో..

క్రోసూరు: పదవతరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని 88 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాల 93 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం వి.లక్ష్మీనారాయణరావు బుధవారం తెలిపారు. పాఠశాలకు చెందిన షేక్ షాహిద్ 587 మార్కులు సాధించాడన్నారు. ఎం.ఊర్మిళ 574, డి.శ్రేయ 572 మార్కులు సాధించినట్లు చెప్పారు.

దూరవిద్యలో 52.65 శాతం ఉత్తీర్ణత

నరసరావుపేట ఈస్ట్: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి దూరవిద్య పరీక్షా ఫలితాలలో పల్నాడు జిల్లా 52.65 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 5వ స్థానంలో నిలిచింది. పరీక్షకు 1,077మంది విద్యార్థులు హాజరు కాగా 567మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే దూరవిద్య ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాలలో 56.51 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచింది. పరీక్షకు 1,196మంది విద్యార్థులు హాజరు కాగా, 1,128 మంది ఉత్తీర్ణులయ్యారు. దూరవిద్య అభ్యాసకులు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల 26వ తేదీ నుంచి మే నెల 5 వరకు ఏపీ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ల నుంచి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. దూరవిద్య అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 19వతేదీ నుంచి 24 వరకు ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహించనున్నట్టు వివరించారు.

బెల్లంకొండ: పది ఫలితాలలో మండలంలో 85 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ. బి.రాజకుమారి తెలిపారు. మండలంలో 248 మంది పరీక్షలు రాయగా 210 మంది పాసైనట్లు తెలిపారు. మండలంలోని కేజీబీవీకి చెందిన బి.ప్రసన్న 580 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది.

విద్యార్థినికి కలెక్టర్ అభినందనలు



షేక్ సమీరా, తల్లిదండ్రులను అభినందిస్తున్న జిలా కలెక్టర్ అరుణ్ కుమార్

మాచర్ల రూరల్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పట్టణంలోని బాలికల పాఠశాల విద్యార్థిని షేక్ సమీరా 596 మార్కులు సాధించి పట్టణంలోనే రికార్డు నెలకొల్పింది. ఆమె తండ్రి సాధారణ మోటార్ మెకానిక్ షేక్ జాన్, తల్లి అబీదా గృహిణి. షేక్ సమీరాను జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జేసీ సూరజ్ గనోరే, డీఆర్‌ఓ మురళి, డీఈఓ చంద్రకళ అభినందించారు. అదేవిధంగా తమ పాఠశాల విద్యార్థిని సజ్యశ్రీకి 586 మార్కులు, ధరణికి 581 వచ్చాయని, 18 మంది 550 పైగా మార్కులు, 32 మందికి 500కి పైగా మార్కులు పొందారని హెచ్‌ఎం తెలిపారు.

■ స్థానిక జెడ్పీహెచ్ఎస్ బాలురు పాఠశాల విద్యార్థి బి.మల్లిఖార్జున 585 మార్కులు సాధించాడని హెచ్‌ఎం ఎం.రామారావు తెలిపారు. తమ పాఠశాల 95శాతం ఉత్తీర్ణత సాధించిందని తెలిపారు.



బి.మల్లిఖార్జున

నేటి నుంచి రీజినల్ వాలీబాల్ స్పోర్ట్స్ మీట్

- హాజరుకానున్న 25 జట్లు
- సత్తెనపల్లిలో నాలుగు రోజుల పాటు పోటీలు
- 27న జాతీయ స్థాయి వాలీబాల్ జట్టు ఎంపిక



వాలీబాల్ పోటీలకు సిద్ధమైన క్రీడా మైదానం

సత్తెనపల్లి: క్రీడల పండుగకు రంగం సిద్ధమైంది. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ (రామకృష్ణాపురం) ప్రాంగణంలో కెవిస్ హైదరాబాద్ రీజినల్ స్థాయి అండర్-17 బాల, బాలికల వాలీబాల్ స్పోర్ట్స్‌మీట్ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే కెవిస్ హైదరాబాద్ రీజినల్ స్థాయి వాలీబాల్ స్పోర్ట్స్‌మీట్ ఈ నెల 27 వరకు నాలుగు రోజుల పాటు హోరాహోరీగా సాగనున్నాయి. దీనికిగాను 8 బాలికల జట్లు, 17 బాలుర జట్లు వెరశి మొత్తం 25 బాల, బాలికల జట్లు తెలుగు రాష్ట్రాల నుంచి హాజరుకానున్నాయి. బాలికల విభాగం నుంచి హైదరాబాద్, విశాఖపట్నం, ఖమ్మం, విజయవాడ, తెనాలి, హకీంపేట, బొల్లారం, సత్తెనపల్లి, బాలుర విభాగానికి సంబంధించి విజయవాడ-1, విజయవాడ -2, ఒంగోలు, తెనాలి, కర్నూలు, వాల్తేరు, బొల్లారం, కంచనబాగ్, హకీంపేట, సత్తెనపల్లి, హైదరాబాద్, సీఆర్పీఎఫ్, బార్‌కాస్, పికెట్, సూర్యలంక, ఖమ్మం నుంచి జట్లు రానున్నాయి. ఈనెల 24, 25న అండర్-17 బాలికలకు, ఈ నెల 26, 27న అండర్-17 బాలురకు పోటీలు జరుగుతాయి. జూలైలో పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల జట్టును ఈ నెల 27న ఎంపిక చేయనున్నారు. క్రీడా పోటీలకు మొత్తం 260 మంది బాల బాలికలు, 40 మంది కోచ్‌లు, ఇతర అఫీషియల్స్ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సత్తెనపల్లి పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను చేపట్టారు.

ఉగ్రదాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి



సత్తెనపల్లి: ఉగ్రవాద దాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లోని న్యాయస్థాన ప్రాంగణంలో ఉన్న న్యాయదేవత విగ్రహం వద్ద బుధవారం న్యాయవాదులందరూ సమావేశమై కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన పౌరుల ఆత్మకు సద్గతులు కలగాలని మౌనం పాటించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ ఉగ్రవాదులు కశ్మీర్ విహారయాత్రకు వెళ్లిన పౌరులను లక్ష్యంగా చేసుకొని వారి మతం అడిగిమరీ హిందువులను అతిహేయంగా హతమార్చారన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ప్రభుత్వం ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలించి వేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజవరపు శివనాగేశ్వరావు, సూరే వీరయ్య, రామిరెడ్డి, దివ్వెల శ్రీనివాసరావు, కళ్ళం వీరభాస్కర్ రెడ్డి, శాస్త్రి, పూజల వెంకట కోటయ్య, చలపతి తదితరులు ఉన్నారు.